# చక్రీయ సౌష్ఠవం

ఏ వారం గుర్తుండకపోయినా యీడో శనివారంమాత్రం బాగా గుర్తుంటుంది రామానికి. ఎక్కడికి వెళ్ళాలన్నా అదే శెలవుదినం. శనివారం కదా అని షికారు వెళదామనుకొన్నాడు రామం. చిలకకొయ్యనున్న చొక్కా తీసి తొడుక్కొంటూవుంటే వీపుమీద చిరుగు ఫక్కున నవ్వింది. అయినా అతనేం చలించలేదు. ఎదురుగా ఆ ప్రక్క చిలకకొయ్యనున్న కోటు ఫరవాలేదని ఓదార్చింది. ఆ కోటు కూడా చివరల దారా లూడిపోతూ శిథిలావస్థలోనే వుంది. అయినా ఆ కోటే ఎన్నో సంవత్సరాలనుంచి తన గౌరవం కాపాడుతోంది. చొక్కాకి యెన్ని చిరుగులున్నా మర్యాదగా కప్పిపుచ్చి తన గౌరవం కాపాడుతోంది. అందుకనే ఆ కోటంటే రామాని కెంతో గౌరవం. కోటుతీసి తొడుక్కున్నాడు.

నలిగి తెగిపోయిన పాదరక్షలు అతని కాళ్లకి దగ్గరగా జరిగాయి. అవి తొడుక్కోబోతోంటే అవతలనించి నరసింగరావు పిలిచాడు.

"రామం!" అంటూ అతను తలుపు త్రోసుకు లోపలికి వచ్చాడు.

"ఓ! నరసింగరావా? ఏమిటి విశేషం?" అనడిగేడు రామం.

"ఓ పదిరూపాయలుంటే సర్దాలోయ్. అర్జంట్" అని సూటిగా అడిగేశాడు నరసింగరావు. అతని మొగంలో యేవో ఆశారేఖలు మెరుస్తున్నాయి.

నరసింగరావు కూడ ఓ గుమాస్తా. ఆ అఫీసులోనే రామంకూడా పనిచేస్తున్నది. ఇద్దరి స్థితిగతులు ఒక్కలాగనే వున్నాయి. అయినా అనేక అక్కరసమయాల్లో రామానికి నరసింగరావు సహాయం చేశాడు. ఇప్పుడతనికే అవసరం వచ్చింది. అసలు రామం అతని కీవరకే పదిరూపాయలు బాకీ వున్నాడు. తనడిగినప్పు డెప్పుడూ నరసింగరావు లేదనలేదు. అందుకే చాల బాధపడ్డాడు రామం లేదని చెప్పడానికి. ఇప్పుడింకా యిరవైఐదవ తారీకు. ఇంక ఆరు రోజులకి కాని జీతం అందదు.

"అంత ముఖ్యమటోయి నరసింగరావూ?" అన్నాడు రామం. ఇంకేమీ అనలేక.

"అవునోయి. నా ఫ్రెండు కొకతనికి నే బాకీ వున్నాను. అతనికి డబ్బు చాల అవసరమట, తక్షణం కావాలని బ్రతిమాలాడు..."

తనకేం చెయ్యడానికీ పాలుపోలేదు రామానికి. అయినా తను మాత్రం చెయ్యగలిగిం దేముంది? ఇది మరీ గడ్డురోజులు, అందులోనూ నెలాఖరు. ఇక తనవద్ద డబ్బెలా వుంటుంది? తనవద్ద

## తంత్రవహి వెంకటరావు

లేదంటే చిన్నబుచ్చుకొంటాడు. ఛీ! ఇన్నిసార్లు తనకి సాయంచేసిన ఒక మిత్రునికి యీమాత్రం సాయం చెయ్యలేకపోవడమా? పైగా తనతనికి బాకీవున్న పదిరూపాయలైనా ఇంకా తీర్చలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు రామం!" అన్నాడు నరసింగరావు.

"ఏముంది? నన్ను పూర్తిగా యెరుగుదువు కదా! నా జీవితం - నా జీతం సంగతి కూడా తెలును గదా? పైగా యివి నెలాఖరు రోజులు. ప్రతి నెలా నీదగ్గరే అప్పుచేసే యీ దరిద్రుడు నీకు అప్పు యెలా యివ్వగలడు చెప్పు? నీకియ్యవలసిన పదిరూపాయలే యియ్యలేకపోతే, యిక నే నెందుకనిపిస్తోంది..."

"అవును. మనం ఇద్దరం ఒకటే. ఎవరు మటుకు యేంచెయ్యగలం?" అని నిట్టూర్చేడు నరసింగరావు.

ఇద్దరూ బజారుకి బయలుదేరారు. రెండు ప్రక్కలా శూన్యంగా చూస్తూ యిద్దరూ నడుస్తున్నారు మౌనంగా. వారికి సామాన్యంగా సాయంత్రం షికారు అలవాటైపోయింది. పగలంతా ఆఫీసులో బండచాకిరిచేసి అలసిపోయి యింటికివచ్చి ఓ అరకప్పు గరమ్ గరమ్ టీ తీసుకుని పట్టణపు మురికిగొందులు దాటి పురవీధుల స్వేచ్ఛావాయువులు పీల్చుదామని బయలుదేరతారు.


ప్రక్కని కోటయ్య మిఠాయికొట్టులోంచి కమ్మని వాసనలు ముక్కుని మత్తెక్కించి చవులూరిస్తోంటే చిల్లికానైనా లేని జేబులో చేతులు తెగ కదులుతోంటే, దారిన మనుష్యుల్ని లాక్కుపోతూన్న రిక్షావాళ్ళని చూస్తూ మౌనంగా నడు


### కావలెను

నెలకు రు. 100/- ల జీతముపై ప్రతి చోటా బ్రాంచి రిప్రజెంటెటీవులు కావలెను. పెట్టుబడి అనవసరం. వివరములకు:
All India Representation & Commercial Services, Hathras U. P.



ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు
విక్టర్ హ్యూగో రచించిన
★ ఘంటారావం ★
నవలకు పుస్తకరూపంలో తెలుగు అనువాదం
అనువాదకులు: సూరంపూడి సీతారామ్
వెల రు. 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకము
ఆంధ్ర గ్రంథ మాల, మద్రాసు-1.



కడప-కర్నూలు కాలువపై రైలుబ్రిడ్జి

స్తున్నారు మిత్రులిద్దరూ. ప్రక్కనున్న హోటల్లోంచి సంగీతం చెవులు గింగురు మనిపిస్తోంది. ఇద్దరూ త్వరత్వరగా నడిచారు.

మిత్రు లిద్దరూ బాధపడుతూనే నడుస్తున్నారు— అన్నీ తెలిసి యెందుకడిగానా అని నరసింగరావు, ఇంత ఆప్త మిత్రుడి అవసరం గడపలేకపోయానే అని రామం-

వాళ్లిద్దరూ విడిపోవాల్సిన వీధి వచ్చింది.

"ఏమీ అనుకోకు! నీకు తెలుసుగా! నేను చెయ్యగలిగిన వాణ్ణయితే చేసివుండే వాణ్ణి. కాని నేను వట్టి అసమర్థుణ్ణి!" అన్నాడు రామం.

"అనవసరంగా అన్నీ తెలిసి నిన్ను కష్ట పెట్టాను నన్ను క్షమించు" అన్నాడు నరసింగరావు.

మిత్రు లిద్దరూ ఒకరిపై నొకరు జాలి పడ్డం తప్పితే యింకేమీ చెయ్యలేకపోయారు.

గబగబా పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ తలవంచుకు వెళ్ళిపోయాడు నరసింగరావు.

బరువెక్కిన హృదయంతో మెల్లిగా ఆలోచిస్తూ నడుస్తున్నాడు బజారువెంట రామం.

ఎలాగో ఒకలాగు పది రూపాయలు సంపాదించాలి. తన కెట్లా వస్తాయి? ఇంకా యీ నెల అద్దె బాకీ వున్నాడు. మొన్ననే పాలవాడు వచ్చి దెబ్బలాడి తన బాకీ తీర్చకపోతే యింక పాలు పొయ్యనన్నాడే! పాలు పొయ్యకపోతే తన పిల్లాడి పనేం కాను? అవతల తల్లివద్ద అసలే పాలు లేవాయె!

ఇలా ఆలోచిస్తూనే నడుస్తున్నాడు బజారువెంట. అలవాటైన రస్తామూలాన అతని కాళ్లు జాగ్రత్తగా బజారులో యే బండి క్రిందా పడకుండా తీసుకుపోతున్నాయి. జీవితంలో యిలా కొన్ని విషయాలపై కొంత కాలానికి బుర్ర పని చెయ్యకుండానే పని జరిగిపోతుంటుంది. అతని వేళ్ళుకూడా బుర్ర చెప్పకుండానే వాటంతటవి టైపు మిషను మీద నాట్యం చేస్తూంటాయి.

అలా నడుస్తూండగా రామం స్మృతిపథంలో తళుక్కున ఓ ఆలోచన మెరిసింది. సీతాపతిమాట జ్ఞాపకం వచ్చింది.

సీతాపతి తనలాగే యింకో ఆఫీసులో గుమాస్తా. అతను క్రిందటి నెల తనదగ్గర పది రూపాయి లప్పుతీసుకున్నాడు. యీ నెల తిరక్కుండా తప్పక తీసుకువచ్చి యిచ్చేస్తానన్నాడు. ఇస్తానంటే యిచ్చేదాకా నిద్ర పట్టదు.

రామం సంతోషంగా నిట్టూర్చాడు. గబగబా పరుగెత్తి సీతాపతి యింటికి వెళ్లాడు.

రామం వెళ్లేసరికి సీతాపతి అప్పుడే బజారుకి బయలుదేరుతున్నాడు. రామాన్ని చూచి "గుడ్ మార్నింగ్ రామం!" అన్నాడు.

ప్రతి నమస్కారం చేశాడు రామం.

"ఏమిటి విశేషం?" అని అడగవలసిన మొదటి ప్రశ్న అడిగి, సాదాగా నవ్వేడు సీతాపతి.

అత నెప్పుడూ నవ్వుతూ ఉంటాడు. లోకంలో నవ్వు తప్పితే యింకోటి లేదంటాడు సీతాపతి. మనకున్న బాధల్ని ఖర్చు పెట్టి నవ్వు సృష్టించుకోవాలంటాడు. నవ్వడం తప్పితే తన కింకోటి తెలీదంటాడు. అతని కింకా గుమాస్తాజీవితపు తొలిరోజులు. ఇంకా ఒంటరిగాడు.

"ఏముందోయి" అంటూ నవ్వేడు రామం.

"నీ పదిరూపాయిలు..." అన్నాడు సీతాపతి.

అతనెప్పుడూ అంతే! తను రూపాయిలడగడానికే వచ్చినట్టు గ్రహించాడు. ఎప్పుడూ ఎదిరి మనసు గ్రహించి, వచ్చే ప్రశ్నకి ముందే సమాధానం చెపుతూంటాడు, అనుకున్నాడు రామం.

"అవును. ఒకమిత్రుని కవసర మొచ్చి వచ్చాను" అన్నాడు రామం.

"సరే! ఈవేళ లేవు. సరిగ్గా రేపు ప్రొద్దున్న ఎనిమిదింటికి...హోటల్ కి రండి. నా కొక మిత్రుడు బాకీవున్నాడు. అత నక్కడికి తప్పక తీసుకువస్తాడు రేపు. అక్కడే మీ కిచ్చేస్తాను." అని ధైర్యం చెప్పి పంపించాడు రామాన్ని సీతాపతి.

ఇప్పుడు ప్రాణం లేచివచ్చినట్లయింది రామానికి. సీతాపతికి కృతజ్ఞత చెప్పి తిన్నగా నరసింగరావు యింటికి వెళ్లాడు.

"ఇంత అర్జంటుగా వచ్చావేం రామం?" అన్నాడు నరసింగరావు.

"నీగురించే! డబ్బడిగేవు కదూ! రేపు వుదయం సరిగ్గా యెనిమిది గంటలకి—హోటల్ కి రా! నా కొక మిత్రుడు బాకీ వున్నాడు. ఆయ నక్కడికొస్తా నన్నాడు. ఆ డబ్బు అక్కడే నీ కిచ్చేస్తాను."

"సరే! రేపెలాగూ ఆపక్కకి రావాలిలే" అన్నాడు నరసింగరావు.

చిరునవ్వు నవ్వుకొంటూ రామం ఇంటికి వచ్చేశాడు.

* * *

రాత్రి తృప్తిగా నిద్రపట్టింది. తన మిత్రుని అవసరం తీర్చగలనుకదా అన్న ఆనందంతో రామానికి మత్తుగా నిద్రపట్టి తెల్లవారి ఆలస్యంగా లేచాడు. తలుపు లేని కిటికీలోంచి సూర్యకిరణాలు సూదుల్లా వచ్చి మీదపడి గుచ్చి లేపితేనే గాని లేవలేదు.

లేచి టైముచూస్తే అప్పుడే ఏడున్నరైపోయింది. గబగబా కాలకృత్యాలు తీర్చుకుని తిన్నగా హోటల్ కి వెళ్ళిపోయాడు. అప్పుడే సరిగా ఆ వైపునుంచి నరసింగరావూ యీ వైపునుండి సీతాపతీ వస్తున్నారు. ముగ్గురు మిత్రులూ ఒకేసారి మెట్లెక్కి లోపలికిపోయి ఒకేచోట కూర్చున్నారు.

మూడు కాఫీలకి ఆర్డర్ వెళ్లింది.

ముగ్గురూ ఒకరిమొగాలవైపొకరు చూచుకున్నారు.

సీతాపతి నరసింగరావువైపు చూశాడు!

నరసింగరావు రామంవైపు చూచాడు!

రామం సీతాపతివైపు చూచాడు!

ముగ్గురూ నవ్వుకొన్నారు.

ముగ్గురి మొగాలలోనూ కొశ్చన్ మార్కు, ఆ తర్వాత ఆశ్చర్యార్థకం గోచరించాయి. చివరికి సీతాపతి హాలు దద్దరిల్లేలా గట్టిగా నవ్వుతూ,


"బాగుంది. నేను వీరికి బాకీ! వీరు వారికి బాకీ, వారు నాకు బాకీ! అహాహా! చక్రీయ సౌష్టవం..."అన్నాడు. ★


కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, తెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము: సలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము"

గోపాలపురం తూర్పుగోదావరి.

కర్నూలు వద్ద హంద్రీనది పరవళ్లు

ఫొటోలు: శ్రీమతి లీలాకుటుంబరావు—కర్నూలు.